క్లుప్తంగా

రంగనాథ్‌పై చర్యలు తీసుకోండి

ఇల్లెందు: ఆదివాసీ మహిళను వివాహం చేసుకున్నట్లు, ఆదివాసీ కుటుంబానికి చెందిన వ్యక్తి ఉద్యోగం చేస్తున్న సింగరేణి టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ అడ్వకేట్ ఫోరం ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ ఆరెం పాపారావు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1991లో మెడికల్ అన్‌ఫిట్ అయిన జార పెంటయ్య కుమార్తెను వివాహం చేసుకున్నట్లు సృష్టించి ఆయన ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై సీఎండీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు దాదాపు రెండు వేల మంది మారుపేర్లతో ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై రంగనాథ్‌ను వివరణ కోరగా.. తాను సింగరేణిని మోసం చేయలేదన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

చుంచుపల్లి: వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ బాదావత్ శాంతి అన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఈ వేసవిలో ప్రజలకు మంచినీటి ఇబ్బంది తల్తెకుండా చూడాలన్నారు. అన్ని తాగునీటి వనరులు పనిచేసేలా చూడాలని అదేవిధంగా అన్ని గ్రామపంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి మెరుగు విద్యాలత, తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ సకినాల రమేష్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, అధికారులు సాయిబాబు, శివయ్య పాల్గొన్నారు.

లీకేజీతో రాజకీయం గమనార్హం

కొత్తగూడెంఅర్బన్: నిరుద్యోగులు, విద్యార్థులు లక్ష్యంగా జరుగుతున్న పరీక్ష పేపర్ల లీకేజీ వ్యవహారంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ పాత్ర ఉందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి పరీక్ష పత్రాల లీకేజీలో పోలీసులు చేసిన విచారణలో బండి సంజయ్ దొరికిపోయారని, అలాంటి వ్యక్తికి రాజ్యాంగబద్ధంగా ఏ పదవులకూ అర్హత లేదన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఎంతో మంది లక్షలు ఖర్చు చేసి వారి పిల్లల చదువుల కోసం కష్టపడుతుంటే... ఇలా లీకులతో రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు. తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న ఈ లీకుల వ్యవహారంలో నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే సంజయ్‌ని జైలులోనే విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సాయి, నాగుల రవికుమార్, వంగా రవిశంకర్, రంజిత్, ఓంసాయి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇల్లెందురూరల్: చల్లసముద్రం గ్రామపంచాయతీలో సర్పంచ్ తాటి చుక్కమ్మ, ఎంపీటీసీ పూనెం లింగమ్మ గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఐలు నారాయణ, పచ్చిపాల రామ్మూర్తి, తాటి భిక్షం, కార్యదర్శి వంశీ పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌గా యాకూబీ

ఇల్లెందురూరల్: బాలాజీనగర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌గా యాకూబీని మరోసారి నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు మండల పంచాయతీ అధికారి చిరంజీవి గురువారం తెలిపారు. ముగ్గురు పిల్లలు ఉన్నారనే ఆరోపణ నేపథ్యంలో ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్న యాకూబీపై అనర్హత వేటు వేస్తూ కలెక్టర్ అనుదీప్ ఫిబ్రవరి 14న ఉత్తర్వులు జారీ చేశారు. తన నుంచి వివరణ కోరలేదని ఆరోపిస్తూ.. యాకూబీ హైకోర్టును ఆశ్రయించింది. ఆమె తరఫు న్యాయవాది వాదనలు విన్న హైకోర్టు కలెక్టర్‌ను వివరణ కోరింది. కలెక్టర్ ఇచ్చే వివరణపై తదుపరి నిర్ణయం వెలువరించే వరకు యాకూబీని వార్డు సభ్యురాలిగా, ఉపసర్పంచ్ హోదాలోనే కొనసాగించాలని హైకోర్టు మార్చి 13న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం యాకూబీకి మళ్లీ ఉపసర్పంచ్‌గా, రెండో సంతకందారుగా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

జూలూరుపాడు: పదో తరగతి పరీక్ష పేపర్లు వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో లీకేజీ కావడంతో మండల కేంద్రం జూలూరుపాడులోని పరీక్ష కేంద్రాల వద్ద ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కట్టుదిట్టమైన పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. గురువారం పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులను పర్యవేక్షణాధికారులగా నియమించారు. దీంతోపాటు పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించలేదు. అధికారులను సిట్టింగ్ స్క్వాడ్‌లుగా ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాలను కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, జూలూరుపాడు సీఐ జె.వసంతకుమార్‌లు పోలీస్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా తహసీల్దార్ శారద, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎస్సై పోటు గణేష్‌లు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

పేరుకే పల్లె ప్రకృతి వనాలు

- నిర్వహణ లేక.. అహ్లాదం కరువు
- వేసవిలో చిన్నారులకు ఆటలు కలే..!
- పట్టించుకోని అధికారులు



మస్సివాగు గ్రామపంచాయతీ పల్లె ప్రకృతివనంలో ఎండిపోయిన మొక్కలు

ఇల్లెందురూరల్: రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ లక్ష్మీపురం పల్లె ప్రకృతి వనంలో నిర్వహణ లేక మొక్కలు ఎండిపోతున్నాయి. మండు వేసవిలో కనీసం రెండు రోజులకోసారైనా మొక్కలకు నీరు అందించాల్సిన ఉన్నా.. వాటిని పట్టించుకోకపోవడంతో ఎదిగే దశలోనే మాడిపోతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించిన ప్రభుత్వం.. స్థానికులకు ఆహ్లాదం అందించాలనే ఆశయం నెరవేరడం లేదు. ఇది కేవలం అధికారుల పర్యవేక్షణ లోపమేనని ప్రజలు వాపోతున్నారు.

పూలమొక్కలతోపాటు నీడనిచ్చే వృక్షాలను ప్రతి గ్రామంలో ఒకచోట ఆహ్లాదకరమైన వాతావరణంగా ఉంచాలనే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్లె ప్రకృతి వనాలను నిర్మించారు. ఒక్కో గ్రామంలో 500 చదరపు గజాల స్థలం నుంచి ఎకరం విస్తీర్ణంలో వీటిని నిర్మించారు. మూడు నాలుగు వరుసల అందమైన మొక్కలను ఆకట్టుకునేలా పెట్టడంతోపాటు నడకదారుల్ని ఏర్పాటు చేశారు. ఉద్యానవనాన్ని తలపించేలా ఇతర సౌకర్యాలను కూడా కల్పించారు. ఇందుకోసం ఒక్కో వనానికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వీటి నిర్మాణాల కోసం రూ.కోట్లు వెచ్చించారు. ఉపాధి హామీ కూలీలకు పని కల్పించేలా గుంతలు తవ్వించడంతోపాటు తీరొక్క మొక్కలను నాటించారు. పలుచోట్ల ఔషధ మొక్కలను నాటించారు. పిల్లలు ఆడుకునే క్రీడా పరికరాలతోపాటు సేదతీరడానికి బల్లలను కూడా ఏర్పాటు చేశారు. ఇలా సుందరంగా తీర్చిదిద్దిన వీటి విషయంలో కొన్ని గ్రామాల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. వాటి నిర్వహణను గాలికి వదిలేశారు.

వేసవిలో చిన్నారులకు ఆనందం ఎలా..

పల్లె ప్రకృతి వనాలలో పలు రకాల పూలమొక్కలు, నీడనిచ్చే పెద్ద మొక్కలను నాటి అహ్లాదకరమైన వాతావరణం సృష్టించారు. ఇంతేకాకుండా సాయంత్రం వేళ చిన్నారులు ఆడుకునేలా పలు రకాలైన వస్తువులను పల్లె ప్రకృతి వనాలలో అమర్చారు. కరోనా కారణంగా గడిచిన రెండేళ్లుగా పల్లె ప్రకృతివనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోలేకపోయారు. కానీ ఈసారి వేసవిలో పల్లె ప్రకృతివనాలను ఆయా స్థానికులు సందర్శిస్తారు కానీ, వాటి నిర్వహణ లేకపోవడంతో ఆహ్లాదం, ఆనందం వారికి అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది.

ఎందుకు ఈ పరిస్థితి..

పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిన సమయంలో వాటి నిర్వహణ బాధ్యతను ఉపాధి హామీ పథకం ద్వారా నియమించబడిన కూలీలకు అప్పగించారు. గతేడాది మార్చి వరకు ఉపాధి హామీ ద్వారా నియమించబడిన కూలీలు తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారు. ఫలితంగా పల్లె ప్రకృతి వనాలు అహ్లాదానికి, పచ్చందాలకు నిలయంగా రూపుదిద్దుకున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగించారు. గ్రామపంచాయతీలు సైతం పంచాయతీ నిధులతో వేతనాలు చెల్లించి పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతను ప్రత్యేకంగా నియమించబడిన కూలీలకు అప్పగించారు. కొన్నిచోట్ల పంచాయతీ అధికారుల పర్యవేక్షణతో ప్రకృతి వనాలు పచ్చదనంతో కనిపిస్తుండగా చాలాచోట్ల మొక్కలన్నీ పంచాయతీల నిర్లక్ష్యంతో నిలువునా ఎండిపోతున్నాయి.

తాళాలు తెరుచుకునేనా..

పల్లె ప్రకృతి వనాలను రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సమకూర్చిన స్థలంలో నెలకొల్పారు. వీటిలో అత్యధికం గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయబడ్డాయి. చాలా వరకు పంచాయతీలలో పల్లె ప్రకృతి వనాలకు నిత్యం తాళం వేసి ఉండటంతో ప్రజలు అటుగా చూడటం లేదనే ఆరోపణలున్నాయి. పంచాయతీ అధికారులు కార్యాలయానికి వచ్చిన సమయంలో అంటే ఉదయం 9 గంటలకు గేట్లకు తాళం తీయడం, సాయంత్రం విధులు ముగించుకొని వెళ్లే సమయంలో అంటే 3 నుంచి 4గంటలకు గేట్లకు తాళం వేయడం నిత్యం జరుగుతోంది. ఇక సెలవురోజుల్లో అక్కడ ఎవరూ కనిపించరు. ఈ పరిస్థితిలో వేసవిలో సాయంత్రం వేళ చిన్నారులు అహ్లాదాన్ని ఆస్వాదించే అవకాశం ఉంటుందా అన్నది ప్రశ్నార్థకమే.



రాఘబోయినగూడెం పంచాయతీ లక్ష్మీపురంలోని పల్లె ప్రకృతి వనం...

ఉపయోగించుకునే అవకాశం లేదు



పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు సమయంలో చెప్పిన మాటలకు ప్రస్తుతం జరుగుతున్న తంతుకు ఎటువంటి సంబంధం లేదు. ప్రతిరోజు గ్రామస్తులంతా ప్రకృతివనంలో వాకింగ్ చేసుకోవచ్చని, విశ్రాంతి తీసుకోవచ్చని, చిన్నారులు ఆడుకోవచ్చని చెప్పారు. కానీ అవి ఆచరణకు నోచుకోవడం లేదు. – సయ్యద్ ఆసిఫ్, ఆజాద్‌నగర్

ఎప్పుడూ తాళం వేసే ఉంటోంది..



పల్లె ప్రకృతి వనాలలో అందమైన పూలు, నీడనిచ్చే మొక్కలు నాటారు. కానీ ఆ అహ్లాదాన్ని ఆస్వాదించే వెసులుబాటు కనిపించడం లేదు. ప్రతిరోజూ సాయంత్రం, సెలవురోజుల్లో తాళం వేసి ఉంటోంది. అధికారులు చర్యలు తీసుకుని ఈ వేసవిలోనైనా సద్వినియోగం చేసుకునే అవకాశం కల్పించాలి.– వాంకుదోత్ విజయ్, విజయలక్ష్మీనగర్

పీడీ యాక్ట్ నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎస్కే నాగుల్‌మీరా

జూలూరుపాడు: ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడులో ఏఐవైఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సీఎం కేసీఆర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమీక్షలు చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. టెన్త్ ప్రశ్నపత్రాలు వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో లీకేజీ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. లీక్‌లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పగడాల అఖిల్, కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా, పసుపులేటి పవన్, కొండా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో ఉద్యోగ భద్రత కల్పించాలి

టేకులపల్లి: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఏపీఓ, మేట్‌లు, టీఏ, ఎఫ్‌ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐకేఎంఎస్, ఇఫ్టూ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 28న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గురువారం మండలంలోని ఎర్రాయిగూడెం, బోడు పంచాయతీల్లో జరుగుతున్న ఈజీఎస్ పని ప్రదేశాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.750 చెల్లించాలని కోరారు. ఉద్యోగావకాశాలు లేక డిగ్రీలు, పీజీలు, బీఈడీ, బీటెక్‌లు చేసిన వేలాది మంది యువతీ, యువకులు ఉపాధి కూలీలుగా పని చేస్తున్నారని వాపోయారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారీ కూలి పెంచాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వడదెబ్బ తగిలి అనారోగ్యం పాలైన వారిని తక్షణ సహాయంగా రూ.5వేలు ఇవ్వాలని, ప్రమాదంలో మరణించిన వారికి రూ.50లక్షలు ఇవ్వాలని, పని దినాలు 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎట్టి నరసింహారావు, రాయండ్ల కోటిలింగం, ఊకె కోటేశ్వర్‌రావు, చీమల నాగరాజు, బాదావత్ శ్రీనివాస్, గుగులోత్ వీరన్న పాల్గొన్నారు.

బీజేపీ ఆటలు సాగనివ్వం..



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: జనరంజక పాలన అందిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఇక మీదట బీజేపీ ఆటలు సాగవని జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్ అన్నారు. గురువారం బీజేపీ చర్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఇల్లెందులో బీజేపీ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ సెంటర్‌లో దహనం చేశారు. అనంతరం దిండిగల మాట్లాడుతూ.. బండి సంజయ్‌కు బీజేపి వత్తాసు పలికిందంటే కుట్రలో ఆ పార్టీ ప్రమేయం ఉంటుందన్నారు. నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, ఎస్.రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, నెమలి ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



కొత్తగూడెంలో ర్యాలీ ప్రారంభిస్తున్న భక్తులు

ఇల్లెందు: పట్టణంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో గురువారం వీర హనుమాన్ విజయయాత్ర నిర్వహించారు. ఖమ్మం విభాగ్ భజరంగ్ దళ్ సంయోజక్ రాములోనియా మాట్లాడుతూ.. హనుమంతుడు సీతామాతను వెతుకుతూ లంకకు చేరుకుని లంకా దహనం చేసిన రోజును వీర హనుమాన్ విజయయాత్ర నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు వేముల రాజేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కీర్తి ప్రసాద్, కార్యకర్తలు నర్సింహారెడ్డి, సాయి పాసీ, విద్యాసాగర్, సురేష్, వంశీ, రజాక్, గోపీకృష్ణ, నాగరాజు, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి మామిడి జయప్రకాష్, ధీరజ్ రోహిత్, బాలకృష్ణ, అనికేత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం.. అంటూ ర్యాలీల్లో హనుమాన్ భక్తులు నినదించారు. గురువారం శ్రీరామ భక్తుడు హనుమాన్ జయంతిని భక్తులు పట్టణంలోని పలు ఆలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున నుంచే అభిషేకాలు, సామూహిక హనుమాన్ చాలీసా, హోమం నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం 21 సార్లు పఠించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పాల్వంచ: హనుమాన్ జయంతి పురస్కరించుకుని గురువారం ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. గణపతి హోమం, మహాభిషేకం, తమలపాకులతో అలంకరణ చేశారు.

రేపు నల్ల బ్యాడ్జిలతో నిరసన

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 8న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు నిరసనగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండకట్టాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా కార్మిక సంఘాలతో పాటు, సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేయాలని కోరారు.

తునికాకు ధర పెంచాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందురూరల్: యాభై తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలని ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. తునికాకు సేకరణలో ఆదివాసీ, గిరిజన పేద ప్రజల శ్రమను పాలకులు దోచుకుంటున్నారని ఆరోపించారు. చంద్ర అరుణ, నాయిని రాజు, కుమార్, బుర్ర వెంకన్న, బండారు సత్యం, శ్రీరాం కోటయ్య, వీరన్న, రాఘవులు, ఆజ్మీర బిచ్చా, శంకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మజ్జిగ ప్యాకెట్లు అందించాలి

ఇల్లెందు: సింగరేణి కార్మికులకు అందిస్తున్న మజ్జిగ ప్యాకెట్లు నాణ్యమైనవి అందించాలని టీబీజీకేఎస్ గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ యాజమాన్యాన్ని కోరారు. ప్యాకెట్ పైన ఐఎస్ఐ సింబల్ గానీ, తయారీ తేదీ గానీ లేకుండా, గడువు ముగిసిన ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్యాకెట్లు సరఫరా చేసే కంపెనీని రద్దు చేయాలని కోరారు. కార్మికుల ఆరోగ్యం మీద దృష్టి సారించాలని విన్నవించారు.

ఆర్థిక సాయం

సుజాతనగర్: విద్యుత్‌షాక్‌తో గాయపడిన సింగభూపాలెం గ్రామానికి చెందిన గోరంట్ల ప్రవీణ్ కుటుంబ సభ్యులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని) గురువారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కోనేరు నాగేశ్వరరావు, గుమలాపురం సత్యనారాయణ, భూక్యా రాజేష్, వెంకటేష్, బూరుగు ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



బీజేపీ జిల్లా కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న నాయకులు

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ జెండా ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. పార్టీ తొలినాళ్లలో కేవలం ఇద్దరు పార్లమెంటు సభ్యులతో ప్రస్థానం ప్రారంభించిన పార్టీ 2014లో ఘనవిజయం సాధించిందన్నారు. 2019లో 303 మంది పార్లమెంటు సభ్యులతో ఘనవిజయం సాధించడం గొప్ప విషయం అన్నారు. నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలను పరిష్కరించిందన్నారు. విద్యానగర్‌లో పార్టీ జాతీయ మీడియా సెల్ కోఆర్డినేటర్ కేవీ.రంగాకిరణ్ జెండా ఎగురవేశారు. గుత్తా వెంకటకృష్ణారావు, యడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, ఆకుల నాగేశ్వరరావు గౌడ్, కోనేరు నాగేశ్వరరావు, పోలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పాండురంగాపురం గ్రామంలో గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాపాక రమేష్, ప్రసాద్‌జైన్, దాసరి రమేష్, వల్లపుల నాగరాజు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న రామారావు

కొత్తగూడెంరూరల్: ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామారావు, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు బి.రాంకుమార్ అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జీఎంఎంఎస్ నంబర్ 3 పునరుద్ధరించి, స్థానిక ఏజెన్సీ ప్రాంత గిరిజనులతో అన్ని శాఖలలో ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత ఉద్యోగులకు రావాల్సిన ఎస్‌ఏ, హెచ్‌ఆర్‌ఏ విడుదల చేసి పీఆర్‌సీ 2020 అనుగుణంగా ఇవ్వాలన్నారు. డీఏ బకాయిలను విడుదల చేయాలని, ప్రతీనెల 1వ తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత గిరిజన అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు. లేదంటే టీటీఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాల ద్వారా హక్కులు సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్.భీమ్‌సింగ్, ఎం.హరిలాల్, ఎ.బాబూరావు, ఎ.బన్సీలాల్, ఈర్యా, మోహన్‌లాల్, ఆర్.వీరన్న, ఎం.వెంకటేశ్వర్లు, బి.రాంకుమార్, బి.బలరాం, జె.బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోంది..



మాట్లాడుతున్న వెంకన్న

టేకులపల్లి: గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న వర్కర్లకు జీఓ నంబర్ 60 అమలు చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని ఇఫ్టూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 9న బేతంపూడి గ్రామంలో జరగనున్న యూనియన్ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం మండలంలోని రోళ్లపాడు, మద్రాస్‌తండా, లచ్చగూడెం, కిష్టారం, మేళ్లమడుగు, గంగారం గ్రామ పంచాయతీలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాపితంగా 40 వేల మంది కార్మికులు గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం వారితో వెట్టి చాకిరీ చేయిస్తూ కనీస వేతనం అమలు చేయడం లేదని విమర్శించారు. కరోనా సమయంలో ఉత్తమ శ్రామికులుగా గుర్తించి గ్రామ పంచాయతీ వర్కర్లకు అవార్డులు ఇచ్చి, సన్మానాలు చేసి, ఇప్పుడు తప్పులు అంటగడుతున్నారని ఆరోపించారు. మల్టీపర్పస్ విధానం ద్వారా జూనియర్లు, సీనియర్లు అనే తేడా లేకుండా అందరూ చెత్త ఏరివేయాలనడం సరైంది కాదన్నారు. మండల ప్రథమ మహాసభకు వర్కర్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సరికొండ నాగేశ్వర్‌రావు, కల్తి వెంకటేశ్వర్లు, రాంశెట్టి నరసింహారావు, సామ్యేల్, జర్పుల కుమార్, బోడ శ్రీనివాస్, రాజేందర్, మహేష్, సంపత్, వెంకటాచారి పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

జూలూరుపాడు: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఈనెల 28న జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్కే ఉమర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్‌లు పిలుపునిచ్చారు. గురువారం గుండెపుడి, రామచంద్రాపురంలో పంట కాలువల పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలను ఏఐకేఎంఎస్ నాయకులు కలిసి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పథకం కింద పని చేసే కూలీలకు నిబంధనలు లేకుండా రోజువారీ వేతనం రూ.750 ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల రోజువారి వేతనం పెంచాలన్నారు. కార్యక్రమంలో వై.గోపాల్‌రావు, భూక్యా చంటి, భూక్యా సూర్యం, కుంజా వెంకటేశ్వర్లు, ఇరప బాలకృష్ణ, తెల్లం ధర్మయ్య, పూనెం సీతారాములు, కోటమ్మ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో చెలగాటం



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ విమర్శించారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపులో భాగంగా హాథ్ సే హాథ్ జోడో యాత్ర పాల్వంచ మండలం రాజాపురం, యానంబైల్ ఎస్సీకాలనీలో గురువారం ఎడవల్లి కృష్ణ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రానికి చేసింది శూన్యం అన్నారు. సామాన్యప్రజలకు పూటగడవడం గండంగా మారుతుంటే పాలకులు మాత్రం పేపర్ లీకులు, లిక్కర్ స్కాంలలో మునిగిపోయారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఎన్నికల హామీలను విస్మరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటలాడుకుంటున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంటగ్యాస్‌ను రూ.500 ఇస్తామన్నారు. రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం చేపడతామని చెప్పారు. పోడుభూముల సమస్యకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీని పునరుద్ధరించి రూ.5లక్షల వరకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసౌకర్యం అందిస్తామని, రైతులకు రుణమాఫీ చేసి ప్రతి సంవత్సరం రూ.15వేలు అందిస్తామన్నారు. నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, కట్టాసోమయ్య, కొండం వెంకన్న, బుడగం కిరణ్, మోహన్‌రావు, గుండా శ్రీనివాసరావు, తొంగల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

దశాబ్దాలుగా కచ్చా రోడ్డే..!



టేకులపల్లి మండలం లచ్చగూడెం గ్రామపంచాయతీ టేకులగుంపు గ్రామానికి వెళ్లాలంటే కచ్చా రోడ్డే దిక్కు. దశాబ్దాలుగా పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా ఈ గ్రామానికి వెళ్లేందుకు పక్కా రోడ్డు మంజూరు కావడం లేదు. లచ్చగూడెం ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి సుమారు ఒక కిలోమీటరు రోడ్డు వేయడానికి పాలకులకు ముహూర్తం దొరకడం లేదు. వర్షం వస్తే వరద, బురదతో స్థానిక ఆదివాసీలు నానా తంటాలు నిత్యకృత్యం. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి టేకులగుంపుకు పక్కా రోడ్డు వేయాలని స్థానికులు కోరారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : బాలరాజు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నంబర్ : 9553230015